



రఘునాథపాలెం: సరుకులు అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు, మధిర రూరల్: ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్, వేంసూరు: బియ్యం, నగదును అందజేస్తున్న మాజీ సర్పంచ్

# వరద బాధితులకు ఆపన్నహస్తాలు

**ముంపు ప్రాంతాల్లో విరివిగా ఆర్థికసాయాలు, దుప్పట్ల పంపిణీలు**

రఘునాథపాలెం, సెప్టెంబర్ 10: జిల్లాలో వర్షాలు, వరదల వల్ల ఇళ్లు మునిగి ఆశ్రయం కోల్పోయిన బాధితులకు బీఆర్ఎస్ సహా పలు పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు ఆపన్న హస్తం అందిస్తున్నాయి. విరివిగా ఆర్థిక సాయాలు అందజేస్తున్నాయి. కొన్ని చోట్ల బియ్యం, మరికొన్ని చోట్ల నిత్యావసర సరుకులు, ఇంకొన్ని చోట్ల దుప్పట్లు పంపిణీ చేస్తూ మానవత్వాని చాటుకుంటున్నాయి.

**'పువ్వాడ' సాయం**

ఖమ్మం పాండురంగాపురంలో వరద ముంపునకు గురైన లోతట్టు ప్రాంత ప్రజలకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అండగా నిలిచారు. ఇంటింటికీ నిత్యావసర సరుకులను అందజేశారు. 'పువ్వాడ' సహాయాన్ని బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటికీ తిరిగి అందజేశారు. 4వ డివిజన్‌లో కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తంగెళ్లపల్లి శ్రీను, కోలేరి సురేశ్‌కుమార్, తీగల సతీశ్‌గౌడ్, మిర్యాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**ఆర్థికసాయం**

మధిర రూరల్, ఆగస్టు10: మండలంలోని తొండలగోపవరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ పింగళి శిరీష వరద బాధిత కుటుంబాలకు మంగళవారం రూ.5వేలు అందజేశారు.

**రాకాశితండాలో డ్రమ్ముల అందజేత**

తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 10: మండలంలోని రాకాశితండ వరద బాధితులకు ఆర్మీ యూత్ అసోసియేషన్, బీఆర్ఎస్ నాయకుడు ఆర్మీ రవి ఆధ్వర్యంలో మంగళవారం 80 కుటుంబాలకు నీటి డ్రమ్ములు, ఎన్నారై ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు అందజేశారు.

**బియ్యం వితరణ**

వేంసూరు, సెప్టెంబర్ 10: ఖమ్మం వరద బాధితుల కోసం మండలంలోని భరిణిపాడు బీఆర్ఎస్ నాయకులు, మాజీసర్పంచ్ మందపాటి మహేశ్వరరెడ్డి పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి మోహన్‌కు మంగళవారం రూ.3 వేలు, 50 కేజీల బియ్యం అందజేశారు.

**దుప్పట్ల పంపిణీ..**

ఖమ్మం/ వైరా టౌన్, సెప్టెంబర్ 10: ఖమ్మం 59, 60 డివిజన్లలో వరదల కారణంగా నిరాశ్రయులైన పేదలకు టీడీపీ నేత కూరపాటి వెంకటేశ్వర్లు ఆర్థిక సహకారంతో మంగళవారం 200 దుప్పట్లు పంపిణీ చేశారు. వైరా 9వ వార్డు ఇందిరమ్మ కాలనీలోని పలువురు వరద బాధితులకు టీడీపీ నేతలు దుప్పట్లు అందజేశారు.

## పాండురంగాపురంలో వినాయకుడి పల్లకీ సేవ



పాండురంగాపురంలో స్వామివారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు



ఖమ్మం శ్రీనివాసనగర్‌లో సరస్వతీ పూజ చేస్తున్న చిన్నారులు

రఘునాథపాలెం, సెప్టెంబర్ 10: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఖమ్మం పాండురంగాపురంలోని శ్రీసాయి గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయకుడికి పల్లకీ సేవ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వినాయకుడి ఉత్సవమూర్తిని పల్లకీలో ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఇళ్ల ముందుకు వచ్చిన గజాననుడిని పల్లకికి భక్తులు నీళ్లు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. డీజే చప్పుళ్లు, బాణాసంచా పేలుళ్లతో కాలనీలో సందడి వాతావరనం నెలకొంది. గణేశ్ మాలధారణ స్వాములు భక్తి పాటలకు నృత్యం చేశారు. ఖమ్మం శ్రీనివాసనగర్‌లోని వినాయక మండపం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు సరస్వతీ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లాలో న్యాస్ ప్రాక్టీస్ పరీక్ష

**ఐదు 'వరద' స్కూళ్లు మినహా జిల్లా వ్యాప్తంగా నిర్వహణ**



పరీక్షను పరిశీలిస్తున్న అకడమిక్ మానిటరింగ్ అధికారి

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 10: జాతీయస్థాయిలో నవంబర్ 19న జరుగనున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్)లో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని స్కూళ్లలో న్యాస్ ప్రాక్టీస్ పరీక్షను నిర్వహించారు. మున్నేరు వరదలతో ఇంకా కోలుకోని జడ్పీహెచ్ఎస్ జలగంనగర్, ఎంపీపీఎస్ జలగంనగర్, జీహెచ్ఎస్ నయాబజార్, జీపీఎస్ నయాబజార్, ఎంపీపీఎస్ ఆర్‌జీ కాలనీ పాఠశాలలు మినహా జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ మంగళవారం ఈ పరీక్షను నిర్వహించారు. 3, 6, 9 తరగతులకు అన్ని యాజమాన్యాల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఈ పరీక్షను నిర్వహించారు. 21,452 మంది విద్యార్థులకుగాను 15,144 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం మూడు ప్రాక్టీస్ టెస్ట్‌లకు మంగళవారం మొదటిది పూర్తయింది. రెండో నమూనా పరీక్ష సెప్టెంబర్ 30న, మూడో సాధన పరీక్ష నవంబర్ 8న నిర్వహించనున్నారు.

## అపశ్రుతులు లేకుండా గణేశ్ నిమజ్జనాలు చేయాలి: ఏడీసీపీ



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ సురేశ్‌కుమార్

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 10: అపశ్రుతులు లేకుండా గణేశ్ నిమజ్జనాలు చేయాలని అడిషనల్ డీసీపీ సురేశ్‌కుమార్ సూచించారు. ఖమ్మం కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్ సమీపంలోని వినాయక నిమజ్జనం ప్రాంతాలను టౌన్ ఏసీపీ రమణమూర్తి, సీఏఆర్ ఏసీపీ సుశీల్‌కుమార్‌లతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయా ఉత్సవ కమిటీల బాధ్యులతో త్రీటౌన్ పీఎస్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేశ్ విగ్రహాలను మున్నేటిలో నిమజ్జనం చేసే సమయంలో ఎలాంటి ఘటనలకూ తావులేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బారికేట్లు ఏర్పాటుపాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. త్రీటౌన్ సీఐ రమేశ్, ఆర్ఐ కామరాజు తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితుల కోసం ఎంపీ రూ.2 కోట్ల విరాళం



సీఎంకు చెక్కు అందిస్తున ఎంపీ

ఖమ్మం, సెప్టెంబర్ 10: రాష్ట్రంలో ఇటీవలి భారీ వర్షాలు, వరదల వల్ల పలు ప్రాంతాల్లోని ప్రజలు సర్వం కోల్పోయినందున వారిని ఆదుకునేందుకు ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి ముందుకొచ్చారు. తన వంతు చేయూతగా విరాళం అందించారు. హైదరాబాద్ రేస్ క్లబ్ డైరెక్టర్ అయిన ఎంపీ రఘురాంరెడ్డి.. మరో డైరెక్టర్ నరసింహారెడ్డితో వెళ్లి హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం కలిశారు. రేస్ క్లబ్ తరపున రూ.2 కోట్ల విరాళం చెక్కును సీఎంకు అందజేశారు.

## 'మున్నేరు వంతెనలపై నిరంతరం ట్రాఫిక్ విధులు'



సిబ్బంకి సూచనలు చేస్తున్న ఏడీసీపీ ప్రసాదరావు

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 10: వరదలు, వినాయక నిమజ్జనాలు నేపథ్యంలో మున్నేరు వంతెనలపై వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా 24 గంటలు ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు తెలిపారు. మంగళవారం నుంచి నగరంలోకి ప్రవేశించే వాహనాలను నిబంధనల మేరకు మాత్రమే అనుమతిస్తున్నట్లు చెప్పారు. ఇటీవలి వరదలకు ప్రకాశ్‌నగర్ వంతెన స్పాన్ బేరింగ్ పక్కకు జరగడంతో మరమ్మతుల కోసం దానిపై రాకపోకలను నిలిపివేసినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో మిగిలిన రెండు వంతెనలపై రద్దీ పెరిగిన దృష్ట్యా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కాల్వొడ్డు, కరుణగిరి వంతెనలపై ట్రాఫిక్ విధుల కోసం 26 మంది అదనపు సిబ్బందిని సీపీ సునీల్‌దత్ కేటాయించారని తెలిపారు. ఈ రెండు వంతెనల పరిధిలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

## వంద శాతం ఫలితాలు సాధించాలి: డీఈవో

సత్తుపల్లి, సెప్టెంబర్ 10: పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను ఇప్పటినుంచే తీర్చిదిద్దాలని డీఈవో సోమశేఖర శర్మ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని గంగారం దాసరి వీరారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధనను తెలుసుకునేందుకు తరగతి గదిలో కూర్చొని పాఠాలు విన్నారు. పలు పాఠ్యాంశాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. నోడల్ ఆఫీసర్ నక్కా రాజేశ్వరరావు, ఎంఈవో చలంచర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారిగా శివప్రసాద్

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 10: మత్స్యశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారిగా డీ.శివప్రసాద్ నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా నెల రోజుల క్రితం జిల్లా మత్స్యశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రాజనర్సయ్య.. సెలవుపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో వైరా డివిజన్ మత్స్యశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శివప్రసాద్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మంగళవారం ఆయన ఐడీవోసీలోని ఆ శాఖ కార్యాలయంలో మత్స్యశాఖ జిల్లా అధికారిగా బాధ్యతలు చేపట్టారు.

## సర్టిఫికెట్ల జారీ ప్రక్రియకు చర్యలు

ఖమ్మం, సెప్టెంబర్ 10: ఖమ్మం నగరంలోని ముంపు ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదల వల్ల సర్టిఫికెట్లు, విలువైన డాక్యుమెంట్లు కోల్పోయిన వారికి తిరిగి వాటిని జారీ చేసే ప్రక్రియను అధికారులు చేపట్టారు. ఇందుకోసం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని ముంపు ప్రభావిత 14 డివిజన్లలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేశారు. కోల్పోయిన సర్టిఫికెట్లు, విలువైన పత్రాల కోసం మంగళవారం మధ్యాహ్నం నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. 46, 47, 48 డివిజన్ల కోసం నయాబజార్ ప్రభుత్వ పాఠశాలలో, 11వ డివిజన్ కోసం ఐటీ హబ్‌లో, 16వ డివిజన్ కోసం ధంసలాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, 17వ డివిజన్ కోసం గీతాంజలి పాఠశాలలో, 49వ డివిజన్ కోసం డీఆర్డీవో కార్యాలయంలో, 28, 29, 30 డివిజన్ల కోసం రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, 59, 60 డివిజన్ల కోసం రామన్నపేట రైతువేదికలో, 34, 35 డివిజన్ల కోసం గాంధీచౌక్ ప్రభుత్వ మహిళా కళాశాలలో శిబిరాలను ఏర్పాటు చేశారు.



## తొలి ప్రైవేట్ స్పేస్‌వాక్

**నలుగురు వ్యోమగాములను నింగిలోకి పంపిన 'స్పేస్ ఎక్స్'**

కేప్ కెనావెరల్, సెప్టెంబర్ 10: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ఖగోళ పరిశోధనా సంస్థ 'స్పేస్ ఎక్స్' సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది. అంతరిక్షంలో తొలిసారి ప్రైవేట్ స్పేస్‌వాక్ నిర్వహించేందుకు 'పొలారిస్ డాన్' ప్రాజెక్టులో భాగంగా నలుగురు వ్యోమగాములను 'ఫాల్కన్-9' రాకెట్ ద్వారా రోదసిలోకి పంపింది. ప్రముఖ బిలియనీర్ జేర్డ్ ఇసాక్‌మన్, 'స్పేస్ ఎక్స్' ఇంజినీర్లు సారా గిల్లీ, అన్నా మెనోన్, అమెరికా వైమానికదళ మాజీ పైలట్ స్కాట్ కిడ్‌తో కూడిన ఈ రాకెట్ మంగళవారం తెల్లవారుజామున ఫ్లోరిడాలోని కెనడీ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. 'పొలారిస్' ప్రాజెక్టులో చేపట్టే మూడు మానవసహిత రోదసి యాత్రల్లో ఇదే మొదటిది. ఈ యాత్ర అనుకున్నట్టుగా సాగితే బుధవారం లేదా గురువారం వారు స్పేస్‌వాక్ నిర్వహిస్తారు.

# మహారాష్ట్రలో ఎన్నికల వేడి

- దీపావళి తర్వాత ఎన్నికలకు అవకాశం
- కసరత్తు ప్రారంభించిన ఎన్నికల సంఘం
- మహాయుతి వర్సెస్ మహా వికాస్ అఘాడీ
- రెండు కూటముల మధ్య హోరాహోరీ
- తేలనున్న శివసేన, ఎన్సీపీ భవిష్యత్తు
- సర్వేల్లో మహా వికాస్ అఘాడీకి మొగ్గు




ముంబై, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల హీట్ మొదలైంది. దీపావళి తర్వాత రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 13న జిల్లాల కలెక్టర్లతో ఈసీ సమీక్ష నిర్వహించనుంది. కాగా, అధికారాన్ని కాపాడుకోవాలనే లక్ష్యంతో బీజేపీ, శివసేన(షిండే), ఎన్సీపీ(అజిత్)తో కూడిన మహాయుతి కూటమి ఎన్నికల బరిలో దిగుతున్నది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన జోష్‌ను కొనసాగించి రాష్ట్రంలో అధికారం దక్కించుకునేందుకు కాంగ్రెస్, శివసేన(ఠాక్రే), ఎన్సీపీ(శరద్ పవార్)తో కూడిన మహా వికాస్ అఘాడీ ప్రయత్నిస్తున్నది. దీంతో రెండు కూటముల మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నది. ఈ ఎన్నికలు రాష్ట్రంలో అధికారం ఎవరిదో నిర్ణయించడంతో పాటు శివసేన, ఎన్సీపీల భవిష్యత్తును కూడా తేల్చేయనున్నాయి. ఈ నేపథ్యంలో రెండు కూటములకు ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి.

**ఏ ప్రాంతంలో ఎవరిది హవా?**

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటికే సర్వేల జోరు మొదలయ్యింది. అయితే, పలు ప్రాంతాల్లో మహాయుతి, ఇంకొన్ని ప్రాంతాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు సర్వేలు చెప్తున్నాయి. విదర్భలోని 62 సీట్లలో మహా వికాస్ అఘాడీ ఆధిపత్యం ఉంటుందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. ఖాందేశ్‌లోని 47 సీట్లలో రెండు కూటములకు సమానంగా విజయావకాశాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కంచుకోట అయిన థాణేతో పాటు కొంకణ్ బెల్ట్‌లోని 39 సీట్లలో మాత్రం మహాయుతి కూటమికి మొగ్గు కనిపిస్తున్నట్టు చెప్తున్నారు. థాణేలో షిండే వైపు నిలుస్తున్న మరాఠా ఓటర్లు ముంబైలో మాత్రం ఉద్ధవ్ ఠాక్రేకు అనుకూలంగా ఉన్నారని, ముంబై బెల్ట్‌లోని 36 నియోజకవర్గాల్లో మహాయుతిపై మహా వికాస్ అఘాడీకి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పవార్ కుటుంబానికి పట్టున్న పశ్చిమ మహారాష్ట్రలోని 58 సీట్లతో పాటు, మరాఠ్వాడాలోని 46 స్థానాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు చెప్తున్నారు. మహాయుతి కంటే మహా వికాస్ అఘాడీకే రాష్ట్రంలో మొగ్గు కనిపిస్తున్నదని లోక్‌పోల్ సర్వే పేర్కొన్నది.

**లోక్‌సభ ఫలితాలు రిపీట్ అవుతాయా?**

మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతి కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కూటమి కేవలం 17 సీట్లతో సరిపెట్టుకోగా, మహా వికాస్ అఘాడీ 30 సీట్లు గెలుచుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత, శాంతిభద్రతలు దెబ్బతినడం, అధిక ధరలు, ఛత్రపతి శివాజీ విగ్రహం కూలడం, మరాఠాల రిజర్వేషన్ల ఉద్యమం, నిరుద్యోగం, మహారాష్ట్ర నుంచి పలు ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లిపోవడం వంటి అంశాలు మహాయుతి కూటమికి వ్యతిరేకంగా మారాయి. మరోవైపు మూడు పార్టీల మధ్య సమన్వయలేమి, సీట్ల పంపకాలు, సీఎం అభ్యర్థిత్వంపై నిర్ణయం తీసుకోలేకపోవడం వంటి అంశాలు మహా వికాస్ అఘాడీకి ప్రతికూలంగా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



**కేదార్‌నాథ్ మార్గంలో విరిగిన కొండచరియలు**

## ఐదుగురి మృతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కేదార్‌నాథ్ వెళ్లే మార్గంలో భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడగా, ఐదుగురు యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం రాత్రి కేదార్‌నాథ్ జాతీయ రహదారిపై సోన్‌ప్రయాగ, గౌరీకుండ్ మధ్య ఈ ఘటన చోటుచేసుకున్నది. కేంద్ర, రాష్ట్ర విపత్తు సహాయక బృందాలు అక్కడికి చేరుకొని, ఘటనాస్థలం నుంచి ఐదు మృతదేహాల్ని వెలికితీసినట్టు రుద్రప్రయాగ్ విపత్తు నిర్వహణ అధికారి నందన్ సింగ్ రాజ్వార్ చెప్పారు. శిథిలాల కింద మరికొంత మంది యాత్రికులు చిక్కుకుపోయి ఉండొచ్చునని పోలీసులు తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో వైష్ణోదేవి ఆలయాన్ని చేరుకునేందుకు కొత్తగా ఏర్పాటుచేసిన మార్గంలో సోమవారం కొండచరియలు విరిగిపడి ఇద్దరు మహిళా యాత్రికులు చనిపోయారు.

## 5 వేల సైబర్ కమెండోలు.. ఆన్‌లైన్ రిజిస్ట్రీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: సైబర్ భద్రతను మరింత పటిష్ఠం చేయడం కోసం కేంద్రం కీలక చర్యలు ప్రకటించింది. 5 వేల మంది సైబర్ కమెండోల నియామకం, వెబ్ ఆధారిత డాటా రిజిస్ట్రీ, సైబర్ నేరాల సమాచారం పంచుకొనే పోర్టల్, జాతీయ అనుమానితుల రిజిస్ట్రీని ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. సైబర్ నేరాలకు హద్దులు లేవని.. సైబర్ భద్రత లేకుండా జాతీయ భద్రత అసాధ్యమని అన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన భారత సైబర్ నేరాల సహకార కేంద్రం(ఐ4సి) మొదటి వ్యవస్థాపక దినోత్సవంలో అమిత్ షా ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన సంబంధిత సంస్థల ప్రతినిధులతో సైబర్ నేరాల తగ్గింపు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

## మహిళా అధికారిపై వింగ్ కమాండర్ లైంగిక దాడి!

- కేసు నమోదు చేసిన పోలీసులు
- విచారణకు ఆదేశించిన ఐఏఎఫ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: భారత వైమానిక దళంలోని ఉన్నత అధికారిపై అత్యాచారం ఆరోపణలు జమ్ముకశ్మీర్‌లో సంచలనం సృష్టించాయి. జమ్ముకశ్మీర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ వింగ్ కమాండర్ తనపై లైంగిక దాడి చేయడమే కాక, మానసికంగా వేధిస్తున్నాడని మహిళా ఫ్లయింగ్ అధికారి ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు ఐఏఎఫ్ అంతర్గత విచారణకు ఆదేశించింది. జమ్ముకశ్మీర్‌లోని బుద్గాం పోలీసు స్టేషన్‌లో వింగ్ కమాండర్‌పై కేసు నమోదు చేశారు. బాధితురాలి కథనం ప్రకారం ఈ ఘటన 2023, డిసెంబర్ 31న న్యూఇయర్ వేడుకల్లో జరిగింది. ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన పార్టీలో ఆ అధికారి తన గదిలో లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించారు.

## తోడేళ్ల భరతం పడుతున్నారు



*ఉత్తర ప్రదేశ్‌లోని భరూచ్‌లో మనుషుల ప్రాణాలను హరిస్తున్న తోడేళ్ల వేట కొనసాగుతున్నది. అటవీ శాఖ అధికారులు స్థానికుల సహాయంతో మంగళవారం వలపన్ని ఒక తోడేలును ఇలా బంధించారు. మిగతా వాటి కోసం వేట కొనసాగుతోంది.*

## 'సిద్ధ' ఔషధాలతో బాలికల్లో రక్తహీనత తగ్గుదల

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కొన్ని 'సిద్ధ' ఔషధాల కాంబినేషన్‌తో కిశోర బాలికల్లో రక్తహీనతను తగ్గిస్తుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ఇండియన్ జర్నల్ ఆఫ్ ట్రెడిషనల్ నాలెడ్జ్‌లో ఇది ప్రచురితమైంది. కేంద్ర ఆయుష్ శాఖ ప్రకటన ప్రకారం.. ఏబీఎంఎన్(అన్నపెటిక్‌సెంచురమ్, బావన కటుక్కాయ్, మతులై మనప్పకు, నెల్లికాయ్ లేహ్యం) మిశ్రమంతో కూడిన సిద్ధ ఔషధం హిమోగ్లోబిన్ స్థాయిలను, రక్త కణాల శాతాన్ని పెంచుతుందని కనుగొన్నారు. శరీరంలో నులి పురుగులు తొలగించిన 2300 కిశోర బాలికలపై 45 రోజులపాటు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ బాలికల్లో రక్త హీనత లక్షణాలైన అయాసం, జుట్టు ఊడిపోవడం, తలనొప్పి, రుతుక్రమ అసమతుల్యత తగ్గినట్టు కనుగొన్నారు. జాతీయ సిద్ధ సంస్థ, తమిళనాడులోని గ్జేవియర్ రిసెర్చ్ ఫౌండేషన్, వెలుమైలు సిద్ధ వైద్య కళాశాల, దవాఖాన తదితర సంస్థలు ఈ అధ్యయనంలో పాల్గొన్నాయి.

సమాన అవకాశాలు ఉంటే

# రిజర్వేషన్లు రద్దు

**లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ వ్యాఖ్య**

వాషింగ్టన్, సెప్టెంబర్ 10: అందరికీ సమానమైన అవకాశాలు ఉన్నప్పుడు రిజర్వేషన్లు రద్దు చేయడం గురించి ఆలోచిస్తామని, ఇప్పుడు భారత్‌లో అందరికీ సమాన అవకాశాలు లేవని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్టన్‌లోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. దేశంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల జనాభా 90 శాతం ఉందని, కానీ దేశంలోని మొదటి 200 వ్యాపారుల్లో, అత్యున్నత న్యాయస్థానాల్లో, మీడియాలో వీరి భాగస్వామ్యం దాదాపు శూన్యమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో 78 మంది కార్యదర్శులు ఉంటే వీరిలో ఒకే ఒక్క గిరిజనుడు, ముగ్గురు దళితులు, ముగ్గురు ఓబీసీలు, ఒక్క మైనారిటీ మాత్రమే ఉన్నారని అన్నారు. కులగణన ద్వారానే దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల స్థితిగతులు తెలుస్తాయని పేర్కొన్నారు.

**రాహుల్ వ్యాఖ్యలపై వివాదం**

వర్జీనియాలో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వివాదంగా మారాయి. 'ఇవాళ భారత్‌లో పోరాటం రాజకీయాల కోసం కాదు. ఒక సిక్కు టర్బన్ ధరించి, గురుద్వారాకు వెళ్లడానికి అనుమతిస్తారా అనే దానిపై పోరాటం జరుగుతున్నది. అన్ని మతాల కోసం జరుగుతున్న పోరాటం ఇది' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను కేంద్రమంత్రి హర్‌దీప్ సింగ్ పురి తప్పుబట్టారు. రాహుల్ మాట్లాడిన భాష ఖలిస్థానీ వేర్పాటువాది గురుత్వంత్ సింగ్ పన్నూ భాషను పోలి ఉందని ఆయన ఆరోపించారు.

# సుప్రీం ఆదేశాలను ధిక్కరించి..!

- నిరసనలు కొనసాగిస్తున్న కోల్‌కతా జూనియర్ డాక్టర్లు
- చర్చలకు రావాలంటూ సీఎం మమతా బెనర్జీ ఆహ్వానం



కోల్‌కతాలో స్వాస్థ్య భవన్ వైపు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

కోల్‌కతా, సెప్టెంబర్ 10: కోల్‌కతా ఆర్‌జీ కర్ దవాఖాన హత్యాచార ఘటనపై నిరసన చేపడుతున్న జూనియర్ డాక్టర్లు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించారు. మంగళవారం ఐదు గంటల్లోపు విధుల్లోకి చేరాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ తమ ఆందోళన కొనసాగించారు. 32వ రోజైన మంగళవారం కూడా విధులు బహిష్కరించి తమ నిరసనను కొనసాగించారు. మరోవైపు, సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి చర్చలకు రావాల్సిందిగా జూనియర్ డాక్టర్లను బెంగాల్ సీఎం మమత బెనర్జీ ఆహ్వానించారు. దీనిని జూనియర్ డాక్టర్లు తిరస్కరించారు.

**నాలుగేండ్లు ఏం చేశారు?**

మలయాళ సినీ పరిశ్రమలో మహిళల వేధింపులపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదికపై ఎలాంటి చర్య తీసుకోకుండా స్తబ్ధుగా, నిష్క్రియాత్మకంగా ఉండటం పట్ల కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు తప్పుబట్టింది. నివేదిక ఇచ్చిన నాలుగేండ్ల తర్వాత మాత్రమే చర్యలు ప్రారంభించిందని, ఇన్నాళ్లూ ప్రభుత్వం ఏం చేసిందనిజస్టిస్‌లు ఏకే జయశంకరన్ నంబియార్, సీఎస్ సుధాలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. వెంటనే కమిటీ పూర్తి నివేదికను (సిట్)కు అప్పగించాలని ఆదేశించింది

**హేమ కమిటీతో ఆదర్శం: పినరయి**

దేశంలోని ఏ రాష్ట్రం చేయని విధంగా చలన చిత్ర పరిశ్రమపై వచ్చిన ఆరోపణలపై తమ ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని వేసి ఆదర్శంగా నిలిచిందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు.

## ఇజ్రాయెల్ దాడిలో 19 మంది మృతి

డెయిర్ అల్-బలాహ్, సెప్టెంబర్ 10: గాజాలోని ఓ రక్షణ గుడారంపై మంగళవారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో కనీసం 19 మంది చనిపోయారని గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. అయితే ఆ గుడారంలో తల దాచుకున్న హమాస్ ఉగ్రవాదులను ఏరివేయడం కోసమే గురి చూసి ఆయుధాలతో దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. మృతుల సంఖ్యపై విభేదించింది. ఇజ్రాయెల్ ప్రకటనను హమాస్ ఖండించింది.

## రష్యాకు ఇరాన్ ఆయుధాలు!

లండన్: రష్యాకు ఇరాన్ ఆయుధాలు సరఫరా చేస్తున్నదని అమెరికా, బ్రిటన్ మంగళవారం ఆరోపించాయి. ఉక్రెయిన్‌పై దాడికి ఉపయోగపడేలా ఇరాన్ స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను రష్యాకు పంపుతున్నదని పేర్కొన్నాయి. ఈ సందర్భంగా తమ దౌత్యవేత్తల కీవ్ ఉమ్మడి సందర్శనకు ముందు మాస్కో, టెహ్రాన్‌పై ఆంక్షలు విధిస్తున్నట్టు ప్రకటించాయి. లండన్‌ను సందర్శించిన అమెరికా కార్యదర్శి ఆంటోని బ్లింకెన్ బ్రిటిష్ విదేశీ కార్యదర్శితో మాట్లాడుతూ ఇలా ఆయుధాలు సరఫరా చేయడం వల్ల సంక్షోభం మరింత తీవ్రతరం అవుతుందని హెచ్చరించినా ఇరాన్ లెక్కచేయలేదని అన్నారు.